'ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం లేదు'

మాచారెడ్డి, నవంబర్ 27 : ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడానికి అవకాశం ఉండదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను జస్టీస్ విక్రమ్‌నాథ్, జస్టీస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తి చూపిందని తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

బాన్సువాడ కోర్టులో విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

బాన్సువాడ రూరల్, నవంబర్ 27 : నిజామాబాద్‌లో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా బాన్సువాడ కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పని చేస్తున్న న్యాయవాదులపై దాడి చేయడం సిగ్గు చేటని విమర్శించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు లక్ష్మారెడ్డి, రమాకాంత్, ఖలీల్, మొగులయ్య, హమీద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్

భిక్కనూరు, నవంబర్ 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను అధికారులు బుధవారం ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, మండల విద్యాధికారి రాజగంగారెడ్డి, మండల నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో భిక్కనూరు ఏటీఎల్ ఇన్‌చార్జి తమ్మల రాజు, మాస్టర్ ట్రైనీలు గణేశ్, వెంకటేశ్, సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

మాచారెడ్డి, నవంబర్ 27 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మంచి విద్యాబోధనను అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి శివారులోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను బుధవారం సందర్శించారు. ముందుగా కలెక్టర్‌కు విద్యార్థులు స్వాగతం పలికారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన అంశాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీని సరిచేయాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల చదువు, భోజనంపై నిత్యావసర సరుకులు తదితర అంశాల పై ప్రిన్సిపాల్ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి రజిత, ప్రిన్సిపాల్ అమర్‌సింగ్, రీజినల్ కో-ఆర్డినేటర్ గంగారాంనాయక్, ఫుడ్ సేఫ్టీ అధికారి శిరీష, తహసీల్దార్ సాయిలు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాలు, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీడబ్ల్యూవో

నస్రుల్లాబాద్, నవంబర్ 27 : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నదని, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇన్‌చార్జి డీడబ్ల్యూవో చందర్ నాయక్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండల కేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల బరువును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, భోజనం సక్రమంగా అందించాలని ఆయన సూచించారు.

ప్రమాణస్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్

నస్రుల్లాబాద్, నవంబర్ 27 : నస్రుల్లాబాద్, బీర్కూర్ ఉమ్మడి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా దుర్గం శ్యామల నియమితులైన సందర్భంగా ఈ నెల 29వ తేదీన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ కోరారు. నస్రుల్లాబాద్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు దుర్గం శ్యామల, మా జీద్, మల్లేశ్, మహేశ్, గిర్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

మాచారెడ్డి, నవంబర్ 27 : పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే రమణారెడ్డి సహకారంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎస్సీ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ బీజేపీ నాయకులు స్వామి, పోతరాజు రాజేశ్, వెంకట్‌గౌడ్, స్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికార కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

మాచారెడ్డి, నవంబర్ 27 : టీహెచ్‌డబ్ల్యూవోఎస్ కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో బుధవారం ఎన్నుకున్నారు. టీహెచ్‌డబ్ల్యూవోఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.చక్రధర్, కార్యదర్శిగా శ్రీనివాస్, సహాధ్యక్షుడిగా ఎస్.నవీన్‌కుమార్, కోశాధికారిగా చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, నరేశ్, గంగాసుధ, సంయుక్తా కార్యదర్శిగా లక్ష్మణ్, రాజేశ్వర్, విజయశాంతి, అర్గనైజింగ్ సెక్రెటరీగా చంద్రకాంత్, పబ్లిసిటీ సెక్రెటరీగా కృష్ణ, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవోస్ అలుపెరగని పోరాటం చేస్తున్నదని, సంఘం ఉద్యోగుల పక్షాన పోరాడుతున్నదని తెలిపారు. టీహెచ్‌డబ్ల్యూవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌస్‌హష్మి మాట్లాడారు. సంక్షేమ అధికారుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ సహకారంతో పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, దేవరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఇనుప సామాన్ల దుకాణం దగ్ధం

కాలిపోతున్న పాత ఇనుప సామన్ల దుకాణం

భిక్కనూరు, నవంబర్ 27 : మండల కేంద్రంలోని సిద్ధిరామేశ్వరస్వామి కమాన్ సమీపంలో ఉన్న పాత ఇనుప సామాను దుకాణం దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరుకు చెందిన ఎం.శ్రీకాంత్ సిద్ధిరామేశ్వరస్వామి కమాన్ సమీపంలో పాత ఇనుప సామాన్ దుకాణాన్ని నడిపిస్తున్నాడు. బుధవారం రోజు రాత్రి దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. వారువచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.60 నుంచి 70 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలి

నాగారంలో మాల సంఘం సభ్యులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

బాన్సువాడ రూరల్, నవంబర్ 27 : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన బహిరంగ సభకు మాల కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బాన్సువాడ మండలంలోని నాగారాం గ్రామంలో మాల సంఘం సభ్యులతో కలిసి సింహగర్జన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు నర్సింహులు, మైసయ్య, మన్నెచిన్న సాయిలు, గంగాధర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 27: ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో మాల సింహగర్జన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. జిల్లా మాల సంఘం యువజన అధ్యక్షుడు జువ్వాడి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల సింహగర్జన కార్యక్రమం హైదరాబాద్‌లోని పెరేడ్‌గ్రౌండ్‌లో ఉంటుందని మాల కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



లింగంపేటలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, నవంబర్27: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని జీవదాన్ ప్రైవేటు పాఠశాలలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వే సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాల ప్రకారం పొరపాట్లకు తావు లేకుండా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో మల్లారీ, గ్రామ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.

డాటా ఎంట్రీ 30 శాతం పూర్తి ..

నాగిరెడ్డిపేట, నవంబర్ 27: మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న సమగ్ర సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ 30 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీవో కార్యాలయంలో చేపడుతున్న డాటా ఎంట్రీని పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

త్వరగా పూర్తి చేయాలి..

బిచ్కుంద, నవంబర్ 27 : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో గోపాలకృష్ణ అధికారులకు సూచించారు. బిచ్కుంద, శాంతాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ఇప్పటి వర కు ఆన్‌లైన్ చేసిన డాటా ఎంట్రీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ నరేందర్

దావల్‌మల్కపల్లి గ్రామంలో వరికొయ్యలు కాల్చడంతో కాలిపోయిన పామాయిల్ చెట్లు

లింగంపేట, నవంబర్ 27: లింగంపేటలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. రాత్రి 10 గంటల సమయంలో ప్రమాదం సంభవించగా గ్రామానికి చెందిన గుండ నర్సింహులు, గుండ స్వామి, గుండ బాలకిషన్‌కు చెందిన రెండు నివాస గృహాలు కాలిపోయాయి. గుండ బాలకిషన్‌కు చెందిన నివాస గృహంలో బీరువా, బట్టలు, వంట సామగ్రి, ఫ్రిజ్, కూలర్, సోఫా, ఫ్యాన్లు, కుర్చీలు, వ్యవసాయ పనిముట్లు కాలిపోయినట్లు బాధితులు వెల్లడించారు. గుండ స్వామికి చెందిన నివాస గృహంలో వంట సామగ్రి, బట్టలు, బియ్యం, రూ.56, 500 నగదు, బీరువా, ఆధార్‌కార్డు, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ నరేందర్‌గౌడ్ సందర్శించి పంచనామా నిర్వహించారు. అగ్ని ప్రమాదం కారణంగా 8.35లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ తెలిపారు.

వరికొయ్యలు కాల్చడంతో కాలిపోయిన పామాయిల్ చెట్లు ..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 27: పంటకోత అనంతరం పొలంలో మిగిలిన వరి కొయ్యలను కాల్చడంతో పక్కపొలంలోని పామాయిల్ చెట్లు కాలిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దావల్‌మల్కాపల్లి గ్రామంలో బుధవారం ఒక రైతు పంటకోతల అనంతరం తన పొలంలో మిగిలిన వరి కొయ్యలకు నిప్పు పెట్టాడు. మంటలు మెల్లిమెల్లిగా వరికొయ్యలను కాలుస్తూ పట్టెం కౌసల్యకు చెందిన పక్కపొలంలోని పామాయిల్ చెట్లకు కూడా అంటుకున్నాయి. ప్రమాదాన్ని గుర్తించిన పొలం యజమానులు వెంటనే మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే కొన్ని పామాయిల్ మొక్కలతో పాటు డ్రిప్‌పైపులు కాలిపోయాయి. వరి కోతల అనంతరం వ్యవసాయశాఖ అధికారులు.. రైతులు గ్రామాల్లో వరికొయ్యలను కాల్చవద్దని అవగాహన కల్పించకపోవడంతో అక్కడక్కడ ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అందువల్ల సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేవి వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డి పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 27: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేవి వ్యాసరచన పోటీలని ఎంఈవో వెంకటేశం అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి జడ్పీ బాలికల పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో 8,9,10వ తరగతులకు చెందిన విద్యార్థులకు 'తరగని శక్తి వనరులు' అంశంపై పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. స్థానిక జీవదాన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాహిత్య ప్రథమస్థానం, జడ్పీహెచ్ఎస్ అడ్విలింగాల్ విద్యార్థిని నాగలక్ష్మి ద్వితీయ స్థానం, ఎల్లారెడ్డి టీజీఎంఎస్ విద్యార్థిని అక్షర తృతీయ స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

వన దేవతల ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

వన దేవతల వేషధారణలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 27: మండల కేంద్రం గోపాల్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు కౌంట్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వన దేవతల వేషధారణలో ర్యాలీ చేపట్టారు. చెట్ల ప్రాముఖ్యతను చాటుతూ.. ఆక్సిజన్ మనకు ఎంత ముఖ్యమో తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. చెట్లను పెంచాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్, రాము, నరేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది

లింగంపేట, నవంబర్ 27: తమను రెగ్యూలర్ చేసి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ఎస్ఏ సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ స్వప్న, రాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

లింగంపేట(తాడ్వాయి), నవంబర్ 27 : తాడ్వాయిలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తాడ్వాయి పోలీసులు తెలిపిన ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన గైని కంసవ్వ ఆటో దిగి రోడ్డు దాటుతుండగా నిజాంసాగర్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం సంభవించింది. బాధితురాలి ఎడమ కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కంసవ్వను 108 అంబులెన్స్ సిబ్బంది ప్రభాకర్, పైలెట్ తరుణ్ ప్రథమ చికిత్స చేసి కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గాంధారి, నవంబర్ 27: మండలంలోని జువ్వాడి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీనాయకులు పంపిణీ చేశారు. ముగ్గురు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ పరమేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, నాయకులు వెంకట్‌రెడ్డి, గణేశ్, మోహన్, సంతోష్, భూమేశ్, మహేశ్, సాగర్ తదితరులు ఉన్నారు.

కోమలంచలో పశు వైద్య శిబిరం

కాటేపల్లి తండాలో రైతులకు నట్టల నివారణ మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి మణికుమార్

నిజాంసాగర్, నవంబర్ 27 : మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులు, కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ, సాధారణ చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ యూనుస్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రులు రఘు, సిద్ధు పాల్గొన్నారు.

కాటేపల్లి తండాలో..

పెద్దకొడప్‌గల్, నవంబర్ 27 : మండలంలోని కాటేపల్లి తండాలో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి మణికుమార్ పశువులకు కృత్రిమ గర్భధారణ, దూడల్లో నట్టల నివారణ విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ బస్వరాజ్, గోపాల మిత్రలు రవి, గౌస గంగారాం ఉన్నారు.

ప్రతి మహిళా వ్యాపారంలో రాణించాలి

రామారెడ్డి, నవంబర్ 27: ప్రతి మహిళా వ్యాపారంలో రాణించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీవో ప్రభాకర్ అన్నారు. సదాశివనగర్ ఐకేపీ కార్యాలయంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు శోభ అధ్యక్షతనత బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అర్థికంగా ముందుకు సాగాలంటే వ్యవసాయేతర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సాయం

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఈవో

లింగంపేట(తాడ్వాయి), నవంబర్ 27: తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రమణయ్య కుటుంబానికి బుధవారం ఆర్థికసాయం అందించారు. మండల విద్యాశాఖ తరపున రూ. 33 వేలు ఆయన కుటుంబీకులకు అందించినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. ఎంఈవో వెంట తాడ్వాయి మండల పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, తాడ్వాయి, ఎర్రపహాడ్ కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎంలు సంగారెడ్డి, కళ్యాణి, ఉపాధ్యాయులు రాజాగౌడ్, నర్సారెడ్డి, నీలం రాజు, ఎండ్రియాల్ స్కూల్ హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605

WANTED

★SBI RURAL SELF EMPLOYMENT TRAINING INSTITUTE, DICHPALLY Wanted Office Assistant -01, on Contract basis, Qualification: Graduate with Computer Knowledge (MS Office), Age: 22 to 40 Year, Written Exam and Interview, Salary 20,000/- to 27,500/- Excluding TA, DA, and other Allowance Last Date for Apply: 07.12.2024 Director SBI RSETI, Dichpally, TTDC, GHANPUR.
NTZ-338224

CHANGE OF NAME

I, KASI VINAY REDDY (Old name) S/o. BAJA REDDY KASI (Old name) Mother: RAJU KASI (Old name) Spouse: LAVANYA KASI (Old Name) H.No.3-33/1, Vill: & Mdl: Jakranpally, Dist. Nizamabad, Telangana, Hence my name changed as KASHI REDDY BHASKAR (New Name) S/o. KASHIREDDY BAKKANNA (NewName) Mother of: KASI REDDY RAJU (New Name) Spouse: KASHI REDDY LAVANYA (New Name)

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.